వైసిపి యూత్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మహేష్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి యువజన విభాగంగా రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నామన మహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధిష్టానం సోమవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ సందర్భంగా నామన మహేష్ మాట్లాడుతూ ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనకు యూత్ విభాగంలో పని చేసేందుకు అవకాశం కల్పించిన సిఎం జగన్మోహన్‌రెడ్డికి, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భీమవరం నియోజకవర్గంలో వైసిపి బలోపేతానికి తన శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు.

నిర్బంధం నడుమ బంద్ పాక్షికం

తణుకులో బస్సులను అడ్డుకుంటున్న మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, టిడిపి నేతలు

టిడిపి బంద్‌పై పోలీసుల ఉక్కుపాదం

జోరు వానలోనూ రోడ్డెక్కిన తెలుగు తమ్ముళ్లు

పాలకొల్లు, ఉండి ఎంఎల్‌ఎలు నిమ్మల, రామరాజుతోపాటు మాజీ ఎంఎల్‌ఎ, మాజీ ఎంఎల్‌సి హౌస్ అరెస్టు

టిడిపి, జనసేన ముఖ్యనేతల గృహనిర్బంధం

మూతపడిన ప్రయివేటు విద్యాసంస్థలు, వ్యాపార దుకాణాలు

ప్రజాశక్తి - భీమవరం

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా జిల్లాలో టిడిపి, జనసేన చేపట్టిన బంద్‌పై పోలీసులు నిర్బంధాన్ని ప్రయోగించారు. అడుగడుగునా ఆంక్షలు విధించి బంద్‌ను అడ్డుకునేందుకు పోలీసులు గట్టిప్రయత్నాలు చేశారు. ఉండి, పాలకొల్లు ఎంఎల్‌ఎలు మంతెన రామరాజు, నిమ్మల రామానాయుడు, తణుకు మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావుతోపాటు టిడిపి, జనసేన ముఖ్యనేతలను హౌస్ అరెస్ట్ చేశారు. బంద్ చేసేందుకు రోడ్డుపైకి ఎవరూ రాకుండా పెద్దఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. అయితే ఆంక్షలు, నిర్బంధాలను ఎదుర్కొని జోరు వానను సైతం లెక్క చేయకుండా రోడ్డుపైకి వచ్చిన టిడిపి, జనసేన నేతలను ఎక్కడికక్కడే అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో బంద్ పాక్షికంగా జరిగింది.

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా జిల్లాలో టిడిపి, జనసేన నేతలు బంద్ నిర్వహించారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం ముందుగానే అప్రమత్తమైంది. జిల్లా కేంద్రం భీమవరంతోపాటు తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం, ఉండి, ఆచంట వంటి కేంద్రాల్లోని ముఖ్య కూడళ్లలో ప్రత్యేక బలగాలు మోహరించాయి. ఆదివారం రాత్రి నుంచి 30 యాక్ట్, 144 సెక్షన్ అమలు చేశారు. ఉండి, పాలకొల్లు ఎంఎల్‌ఎలు మంతెన రామరాజు, నిమ్మల రామానాయుడు, తణుకు మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, టిడిపి నేతలు మెంటే పార్థసారథి, పొత్తూరి రామరాజు, కరిమెరక నాగరాజు, కొప్పాడ రవీంద్ర, ఉమామహేశ్వరరావు, కనకరాజు, జనసేన నేతలు బొమ్మిడి నాయకర్, జుత్తిగ నాగరాజు, చలమలశెట్టి చంద్రశేఖర్‌తోపాటు పలువురు నేతలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. దీంతో వారంతా ఇంటి వద్దనే ఉండి నిరసన తెలిపారు.

అడ్డుకుని.. పోలీస్ స్టేషన్లకు తరలించి

బంద్ నిర్వహణకు రోడ్డుపైకొచ్చిన టిడిపి, జనసేన శ్రేణులను పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలు, నిరసనలను సైతం అడ్డుకుని నేతలను అదుపులోకి తీసుకున్నారు. నరసాపురం, ఉండి, వీరవాసరం, తణుకు, పాలకొల్లు ప్రాంతాల్లో నేతలను ఆయా పోలీసు స్టేషన్లకు తరలించి నిర్బంధించారు. ఆకివీడులో ర్యాలీ నిర్వహిస్తున్న వారిని అడ్డుకుని టిడిపి కార్యాలయానికి తరలించి నిర్బంధించారు. వీరవాసరంలో నేతలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. భీమవరం ప్రకాశం చౌక్‌లో టిడిపి, జనసేన శ్రేణులను అడ్డుకుని వారి పార్టీ కార్యాలయానికి తరలించారు. నరసాపురం, ఉండిలో నిరసన తెలుపుతున్న నేతలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

ప్రయివేట్ విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు బంద్

జిల్లాలోని ప్రయివేటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగానే బంద్ పాటించాయి. టిడిపి అధిష్టానం బంద్‌కు పిలుపునివ్వగానే ఆదివారం రాత్రి ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్ నేపథ్యంలో సెలవు ప్రకటించాయి. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్లకు మెసేజీ రూపంలో సమాచారం అందించారు. దీంతో ఏఒక్క ప్రయివేటు విద్యాసంస్థ కూడా తెరుచుకోలేదు. కొన్నిచోట్ల ప్రభుత్వ పాఠశాలలను టిడిపి నేతలు మూయించారు. మరికొన్ని పాఠశాలలు యథావిధిగా కొనసాగాయి. పలు వ్యాపార సంస్థలు కూడా మూతపడ్డాయి. ఛాంబర్ ఆఫ్ కామర్స్, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్, ప్యాడీ అండ్ మర్చంట్ అసోసియేషన్, సినిమా థియేటర్ ఓనర్స్ అసోసియేషన్, ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు టిడిపి నేతలు నోటీసులు అందజేసి బంద్‌కు సహకరించాలని కోరారు. కొన్నిచోట్ల టిడిపి, జనసేన శ్రేణులు దగ్గరుండి బ్యాంకులు, దుకాణాలను మూయించారు. ఉదయం 11 గంటల తర్వాత అవన్నీ యథావిధిగా తెరుచుకోవడం, ఆర్‌టిసి బస్సులు తిరగడంతో జిల్లాలో బంద్ పాక్షికంగానే జరిగింది.

పాలకొల్లులో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సిఐ, ఎంఎల్‌ఎ మధ్య తీవ్ర వాగ్వివాదం

పాలకొల్లులో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడుకు, సిఐ రాంబాబుకు మధ్య వాగ్వివాదం

పాలకొల్లు: పాలకొల్లులో టిడిపి బంద్ సందర్భంగా వ్యాపారులు తమ వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా మూసివేశారు. పోలీసులు పలు కూడళ్లలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడును హౌస్ అరెస్ట్ చేశారు. గాంధీబొమ్మ సెంటర్ వద్ద మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు ధర్నా చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని ఇంటికి తీసుకెళ్లి గృహనిర్బంధం చేశారు. టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛందంగా మూసివేసిన దుకాణాలను పోలీసులు బలవంతంగా తెరిపిస్తున్నారని టిడిపి శ్రేణులు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లగా ఇదేం తీరు అంటూ రామానాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పట్టణ సిఐ డి.రాంబాబుకు, ఎంఎల్‌ఎ నిమ్మలకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. పట్టణ ఎస్‌ఐ మూసి ఉన్న ఒక దుకాణాన్ని తెరవాలని ఒత్తిడి తెచ్చారని, దుకాణం తెరవకపోతే రేపటి నుంచి వ్యాపారం ఎలా చేస్తావో.. దుకాణం ఎదుట వాహనాలు ఎలా పెడతావో చూస్తా అని హెచ్చరించడం ఏమిటని ఎంఎల్‌ఎ సిఐను నిలదీశారు. ఇటీవల తనను చంపడానికి కత్తులతో కొందరు రెక్కీ నిర్వహించడంపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. పోలీసులు శాంతిభద్రతల సమస్య వచ్చినపుడు జోక్యం చేసుకోవాలని, అంతేగాని వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ చేస్తే వారిని బెదిరించడం సరికాదని ఎంఎల్‌ఎ రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపికి సేవ చేయాలంటే యూనిఫారం తీసి ఆ పార్టీలో చేరి సేవ చేయండి అని ఎంఎల్‌ఎ వ్యాఖ్యానించారు. బంద్ కార్యక్రమాల్లో టిడిపి నేతలతోపాటు జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, రియా తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రజాస్వామిక హక్కు

బంద్ సందర్భంగా అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

భీమవరం: నిరసన అనేది రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక హక్కు అని, టిడిపి బంద్ నేపథ్యంలో ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలు దారుణమని సిపిఎం జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి చేపట్టిన బంద్ సందర్భంగా జిల్లాలో టిడిపి, జనసేన నేతల అరెస్టు సరికాదని పేర్కొన్నారు. పాలకొల్లు, ఉండి ఎంఎల్‌ఎలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, తణుకు మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిడిపి, జనసేన ముఖ్యనేతలను గృహనిర్బంధంలో ఉంచడాన్ని ఖండించారు. శాంతియుత నిరసనలపై నిర్బంధం, 144 సెక్షన్, 30 యాక్ట్ అమలు అమానుషమని తెలిపారు. అరెస్టు చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రణాళికాబద్ధంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కలెక్టర్ ప్రశాంతి

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో వైద్యఆరోగ్య శాఖ, గృహ నిర్మాణం, ప్రాధాన్యత భవనాలు, జాతీయ ఉపాధి హామీ, జిజిఎంపి, చేయూత, జగనన్న తోడు, నాడు-నేడు, జిఇఆర్, ఎస్‌డిజిఎస్, టిడ్కో గృహాలు తదితర 12 అంశాలపై జిల్లాలోని సంబంధిత అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనుందన్నారు. ఈ నెల 15 నుంచి సిహెచ్‌ఒలు, ఎఎన్‌ఎంలు, ఆశాలు వారి క్లస్టర్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి ప్రజలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పట్ల అవగాహన కల్పించడం, ప్రాథమిక పరీక్షలతో ఆరోగ్య సమస్యలను గుర్తించడం చేస్తారన్నారు. ఈ నెల 30న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, జగనన్న ఆరోగ్య సురక్ష స్పెషల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న డిఆర్‌ఒ కృష్ణవేణి

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి

ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో ఇచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించాలని డిఆర్‌ఒ కె.కృష్ణవేణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. డిఆర్‌ఒ కృష్ణవేణి, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, డిపిఒ జివికె.మల్లికార్జునరావు ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ కృష్ణవేణి మాట్లాడుతూ ప్రజల అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. 70 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వయోవృద్ధుల ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వర్షంతో నిలిచిన ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు

13వ తేదీకి వాయిదా: డిఐజి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు రేంజ్ పరిధిలో ఎస్‌ఐ అభ్యర్థులకు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు సోమవారం వర్షం కారణంగా వాయిదా వేశారు. నగరంలోని పోలీస్ మైదానంలో 15 రోజులుగా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం ఆకస్మికంగా వర్షం రావడంతో పరీక్షలు వాయిదా వేశారు. వీటిని మళ్లీ ఈ నెల 13న నిర్వహిస్తామని ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

8 నుంచి వ్యకాస రాష్ట్ర సమావేశాలు

ఏలూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సదస్సు, సమావేశాలు అక్టోబర్ 8, 9, 10 తేదీల్లో ఏలూరులో నిర్వహింస్తున్నామని, ఈ సమావేశాలు జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా సోమవారం రాష్ట్ర సదస్సు, సమావేశాల కరపత్రాన్ని స్థానిక అన్నే భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ మాట్లాడుతూ సమావేశాలకు ముఖ్యఅతిథిగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, ఉభయగోదావరి జిల్లాల టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సిలు షేక్ సాబ్జి, ఐ.వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, మరో 300 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు.

గణపవరంలో వినతి అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి

ప్రజాశక్తి - గణపవరం

తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అందరికీ ఎఫ్‌టిఇ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు సోమవారం ఎంపిడిఒ జి.జ్యోతిర్మయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కె.రాముడు, ఐఎన్‌వి.జ్యోతి మాట్లాడుతూ గత 17 ఏళ్లగా పని చేస్తున్న వారికి కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారిని గుర్తించాలని కోరారు. ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో సాంకేతిక కారణాల వల్ల చేసిన పనులకు కూలీల హాజరు, పని ప్రదేశాల్లో ఫొటోలు అప్‌లోడ్ కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు ఎ.కనకదుర్గ, సహాయ కార్యదర్శి వి.సత్యనారాయణ, కోశాధికారి శ్రీనివాసు, నాయకులు సుజాత, నాగలక్ష్మి, కనకదుర్గ, దుర్గారావు పాల్గొన్నారు.

కాళ్ల: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.భవాని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఫీల్డ్ అసిస్టెంట్లు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ మ్యాన్ డేస్ విధానం రద్దు చేయాలని కోరారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, ఎంపిడిఒ జి.స్వాతికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షులు యిర్రింకి ఏడుకొండలు, ఉపాధ్యక్షులు ఈదా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో వినతులు అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కుండపోత

జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేని వర్షం

ఇళ్లకే పరిమితమైన జనం

నీట మునిగిన వరిచేలు

ఆందోళనలో రైతులు

కాల్వలను తలపించిన రహదరులు

ఆక్వా సాగుపై తీవ్ర ప్రభావం

మొగల్తూరు మండలం కాళీపట్నంలో జాతీయ రహదారిపైకి చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి - భీమవరం

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో సోమవారం కుండపోత వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిశాయి. ఇంటి నుంచి కాలు బయట పెట్టే పరిస్థితి కన్పించలేదు. వర్షానికి తోడు బంద్ కావడంతో సామాన్య ప్రజలతోపాటు అన్ని తరగతుల ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. రహదారులన్నీ నీట మునిగి కాల్వలను తలపించడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. బలమైన గాలులు వీయడంతో వృక్షాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా పల్లపు ప్రాంతాల్లోని వరి పొలాలు నీట మునిగాయి. ఇప్పటికే ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆక్వా రైతుల పరిస్థితీ అగమ్యగోచరంగా మారింది.

ఈ ఏడాది ఆశించిన మేర వర్షాలు లేవని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వర్షపాతం కూడా సగటుకు తక్కువగానే నమోదైనట్లు అధికారులు ఇటీవల ప్రకటించారు. ఇటు రైతులతోపాటు ఉక్కబోతో జనం తల్లడిల్లారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ ఎడతెరిపిలేకుండా కుండపోత వర్షం కురిసింది. జిల్లా కేంద్రమైన భీమవరంతోపాటు పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట, ఉండి, కాళ్ల, మొగల్తూరు, ఆచంట, వీరవాసరం తదితర ప్రాంతాల్లో వర్షం విస్తారంగా కురిసింది. ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రహదారులు కూడా నీట మునిగాయి. భీమవరం బస్టాండ్ ప్రాంతం, ప్రకాశం చౌక్, పాత బస్టాండ్ సెంటర్, మావుళ్లమ్మ గుడి, బొంబాయి స్వీట్స్, రాము స్వీట్ సెంటర్లు, హౌసింగ్ బోర్డ్ కాలనీ, రెస్ట్‌హౌస్ రోడ్డు, ఇండస్ట్రియల్ ఏరియా, బ్యాంక్ కాలనీతోపాటు రహదారులన్నీ జలమయమై కాల్వలను తలపించాయి. ఇదిలా ఉంటే మెంటేవారితోటకు వెళ్లే రెండు అండర్ టన్నెల్స్, గునుపూడి అండర్ టన్నెల్, భీమవరం-తాడేపల్లిగూడెం రోడ్డులో ఉన్న మరో అండర్ టన్నెల్‌లోకి వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. వర్షం వల్ల చేతివృత్తిదారులు, చిరుద్యోగులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గాలులకు పలుచోట్ల చెట్లు, కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ తీగలు తెగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

నీట మునిగిన వరి పొలాలు

ఎంతో వ్యయ ప్రయాసల నడుమ సార్వా సాగు చేపట్టిన రైతులకు అడుగడుగునా కష్టాలు తప్పట్లేదు. జిల్లావ్యాప్తంగా రైతులు 2.40 లక్షల ఎకరాల్లో రైతులు సార్వా సాగు చేశారు. జూన్ ఒకటో తేదీ నాటికి నీటిని విడుదల చేసినప్పటికీ తీవ్రమైన ఎండలు తదితర కారణాల రీత్యా శివారు ప్రాంతాలకు సాగునీరందడం బాగా ఆలస్యమైంది. దీంతో సార్వా సాగు ఆలస్యమైంది. ఈ క్రమంలో ప్రస్తుత వర్షానికి పల్లపు ప్రాంతాల్లోని వరి పొలాలు నీట మునిగాయి. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు కొంత ఉపశమనమైనప్పటికీ భారీ వర్షం కొనసాగితే నష్టం తప్పదని వ్యవసాయాధికారులు సైతం చెబుతున్నారు. పాలకోడేరు, ఉండి, కాళ్ల, భీమవరం రూరల్, ఆకివీడు, ఆచంట, కాళ్ల, వీరవాసరం, మొగల్తూరు, పెనుమంట్ర, పోడూరు, తాడేపల్లిగూడెం మండలాల్లో వరిచేలు నీట మునిగినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఇప్పటికే ఎకరానికి రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకూ పెట్టుబడులు పెట్టిన రైతులు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆందోళన చెందుతున్నారు.

ఆక్వా సాగుపై తీవ్ర ప్రభావం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఆక్వాసాగుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం కన్పిస్తోంది. దీంతో ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్వా సాగుకు వాతావరణం అనుకూలించకపోతే భారీస్థాయిలో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 1,06,210 ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. దీనిలో 49,400 ఎకరాల్లో రొయ్యలు, 56,810 ఎకరాల్లో చేపలు సాగవుతున్నాయి. ప్రస్తుతం రొయ్యల సాగు ఇబ్బందుల మధ్య సాగుతోంది. న్యాయమైన సీడ్ దొరకకపోవడం, మేత ధరలు అధికంగా ఉండటం, రొయ్యల ధర నిలకడగా లేకపోవడం వంటి సమస్యలు తలెత్తడంతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం వర్షం ధాటికి రొయ్యలు చనిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

భీమవరంలో అండర్ టన్నెల్లో నిలిచిన వర్షపు నీటి తోడకం

భీమవరం రూరల్: భీమవరంలో సోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వర్షం కురిసింది. రోడ్లపై గోతుల్లోకి వర్షపు నీరు చేరడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పెనుమంట్ర: మండలంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. పొలమూరు నుండి బ్రాహ్మణచెరువు వెళ్లే రహదారి, పెనుమంట్ర నుంచి జుత్తిగ వెళ్లే రహదారి, పొలమూరు నుండి మాముడూరు వెళ్లే రహదారులపై గొయ్యిల్లో పెద్దఎత్తున వర్షపునీరు నిలవడంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి.

మొగల్తూరు: మండలంలో సోమవారం తెల్లవారుజాము నుండి భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. మొగల్తూరు నుండి వెంప, మోడీ పేరుపాలెం, కాళీపట్నం, పాతపాడు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉండటంతో రహదారులపై నీరు నిలిచిపోయింది. మొగల్తూరులోని ముక్కువారివీధి, సత్తెమ్మ వీధి, హైస్కూల్ రోడ్డుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది.

మండలంలోని కాళీపట్నంలో జాతీయ రహదారి జలమయమైంది. సోమవారం తెల్లవారుజాము నుండి కురిసిన భారీ వర్షానికి రహదారిపై వాన నీరు నిలిచిపోయింది. జాతీయ రహదారి పక్కనే పూర్తిస్థాయిలో డ్రెయినేజీ నిర్మించకపోవడంతో నీరు బయటకు వెళ్లే మార్గం లేక రహదారి నీట మునిగింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఆచంట: అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో పలు పల్లప్రాంతాలు జలమయమయ్యాయి. అసలే అధ్వానంగా ఉన్న గ్రామీణ రహదారుల పరిస్థితి ఈ వర్షాలకు మరింత దిగజారాయి. ఆచంటలో ఆవాసాల చుట్టూ వర్షపు నీరు చేరింది. కరుగోరుమిల్లి పంచాయతీ పరిధి కొత్త హరిజనపేట, వల్లూరు ఇందిరమ్మ కాలనీ, ఆచంట వేమవరం, పెనుమంచిలి, కొడమంచిలి తదితర కాలనీల్లో రహదారులు నీట మునగడంతో ఆ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

నరసాపురం టౌన్: భారీ వర్షానికి పట్టణంలోని మెయిన్ రోడ్డు ప్రధాన కూడలి వద్ద నీళ్లు నిలిచిపోయాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకూ భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణ, గ్రామాల్లోని రహదారులు ముంపు బారినపడ్డాయి. డ్రెయిన్లు పొంగిపొర్లాయి.

టిడిపి బంద్ ప్రశాంతం

తాడేపల్లిగూడెంలో..

ప్రజాశక్తి - యంత్రాంగం

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ సోమవారం చేపట్టిన బంద్ జిల్లాలో ప్రశాంతంగా సాగింది. ఈ సందర్భంగా పలుచోట్ల వ్యాపార దుకాణాలు, విద్యాసంస్థలు, బ్యాంకులు మూతపడ్డాయి. కొందరు స్వచ్ఛందంగా దుకాణాలు, ప్రయివేటు విద్యాసంస్థలను మూసివేసి బంద్‌కు సహకరించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

భీమవరం రూరల్: చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ భీమవరంలో ఆ పార్టీ శ్రేణులు చేపట్టిన బంద్ పాక్షికంగా జరిగింది. టిడిపి, జనసేన నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో బంద్ నిర్వహణకు స్థానిక ప్రకాశం చౌక్‌కు చేరుకున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలోని దుకాణాలు మూయించారు. ఇదే క్రమంలో కొందరు వ్యాపారులు స్వచ్ఛందంగానే తమ దుకాణాలు మూసివేశారు. ఈ క్రమంలో టిడిపి, జనసేన నేతలను పోలీసులు అడ్డుకున్నారు. టిడిపి నేత మెంటే పార్థసారధి, జనసేన నేత చెలమలశెట్టి చంద్రశేఖర్‌తోపాటు పలువురు నేతలను పోలీసు వ్యాన్లలో ఎక్కించి వారి నివాసాలకు తరలించి గృహనిర్బంధం చేశారు. మిగిలిన నేతలను టిడిపి కార్యాలయం వద్దకు తరలించి అక్కడ నిర్బంధించారు. టిడిపి కార్యాలయం వద్ద రిలేదీక్షలు కొనసాగాయి. దీక్షల్లో నేతలు వేండ్ర శ్రీనివాస్, గంటా త్రిమూర్తులు, చంద్రశేఖర్, ఐజాక్‌బాబు, గూడూరు సుబ్బారావు, ఏసుపాదం పాల్గొన్నారు. పోలీసు బందోబస్తు నడుమ ఆర్‌టిసి బస్సులు యధావిధిగా నడిచాయి.

ఆచంట : ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. టిడిపి నేతలు కచేరీ సెంటర్‌లో జోరు వర్షంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేతలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం సమయంలో వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు. జనసేన నాయకులు జవ్వాది బాలాజీ, నంబూరు విజయ్, పితాని లక్ష్మణ్, నిమ్మన వీరశేఖర్‌బాబు, సిపిఎం నాయకులు వర్ధిపర్తి అంజిబాబు, ఎస్‌విఎన్.శర్మ, తలుపూరి బుల్లబ్బాయి, సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు, పార్టీ మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నాయకులు గొడవర్తి శ్రీరాములు, చింతకూరి సత్యవతి, బీర నరసింహమూర్తి, ఆకుమర్తి మోహన్, వర్ధనపుపూరి, సిర్రా బాలాజీ, నెక్కంటి ప్రభాకరరావు పాల్గొన్నారు.

భీమవరంలో..

కాళ్ల : మండల కేంద్రమైన కాళ్లలో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. జువ్వలపాలెం, ఏలురుపాడు, కాళ్లకూరు, కాళ్ల, జక్కరం, కోపల్లె తదితర గ్రామాల్లో వ్యాపార సముదాయాలు, పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయి. పోలీసులు పలు కూడళ్లలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కాళ్లలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో షాపులను స్వచ్ఛందంగా మూసివేశారు. మండలంలో బంద్ ప్రశాంతంగా సాగింది.

పెనుమంట్ర : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి చేపట్టిన బంద్ మండలంలో పాక్షికంగా సాగింది. ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలతో పాటు బ్యాంకులు, వ్యాపార సంస్థలను మూసివేశారు. పెనుమంట్ర, మామిడూరు, భట్లమగుటూరుతో పాటు పలు గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాస రెడ్డి, కార్యదర్శి మురళీమోహన్‌రావు, కర్రి అచ్యుత రామిరెడ్డి పాల్గొన్నారు. మండలంలో అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఎస్ఐ షేక్ మదీనాబాషా శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

గణపవరం : జనసేన, టిడిపి ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, వ్యాపార, ప్రభుత్వ సంస్థలు మూతపడ్డాయి. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కె.సురేంద్రరాజు, జనసేన నాయకులు వంగా రఘు, తోట శ్రీను, మైనార్టీ సెల్ నాయకులు బషీరుద్దీన్, వెంకటేశ్వరరావు, మధు, చిన్న, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

మొగల్తూరు : మండలంలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. మొగల్తూరులోని దుకాణాలను ఆ పార్టీ నాయకులు మూయించి వేశారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పాల రాంబాబు, గోపాలం, బి.చంటి, కొల్లాటి భోగరాజు, బస్వాని ఏడుకొండలు, గుబ్బల చిన్న నాగరాజు, కృష్ణ, పాము శ్రీధర్, వెలిది పుల్లారావు పాల్గొన్నారు.

పెనుగొండ : టిడిపి, జనసేన ఆధ్వర్యంలో పెనుగొండలో బంద్ సందర్భంగా ధర్నా నిర్వహించారు. కాలేజీ సెంటర్ నుండి బజార్ రోడ్డు మీదగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వ్యాపార సముదాయాలు, బ్యాంకులు, విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి కటికిరెడ్డి నానాజీ, నక్క వేదవ్యాసశాస్త్రి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండి : టిడిపి బంద్‌కు జనసేన మద్దతు తెలిపిన నేపథ్యంలో జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజును ఎఎస్ఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు గృహనిర్బంధం చేశారు. తెల్లవారుజామున మహదేవపట్నంలోని జుత్తిగ నాగరాజు నివాసానికి చేరుకున్న పోలీసులు ఆయనను ఇంటిలోనే నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత పాలన నడుస్తుందని, ప్రశ్నించిన వారిని అరెస్టు చేస్తున్నారని విమర్శించారు. పవన్ కల్యాణ్‌ని సైతం అడ్డుకున్నారని, ఆయన రోడ్డు మార్గంలో ప్రశాంతంగా వస్తుంటే ఆయన్ని ఎన్ని ఇబ్బందులు పెట్టారో రాష్ట్ర ప్రజానీకం చూస్తోందని, అధికార పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేయాలన్నదే జగన్ లక్ష్యంగా కనిపిస్తుందని, ఇది ప్రజాస్వామ్యంలో ఎంతమాత్రమూ సాధ్యంకాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వీరవాసరం : మండలంలో బంద్ పాక్షికంగా జరిగింది. బలవంతంగా దుకాణాలు మూయిస్తున్నారంటూ టిడిపికి చెందిన నలుగురిని ఎస్ఐ రమేష్ అదుపులోకి తీసుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరిస్థితిని పోలీసులు పర్యవేక్షించారు.

తాడేపల్లిగూడెం : నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని తలుకా ఆఫీస్, ఆర్‌టిసి బస్టాండ్ వద్ద టిడిపి నాయకులు ధర్నా నిర్వహించారు. బంద్‌కు వ్యాపార సముదాయాలు, బ్యాంకులు, పలు ప్రయివేటు విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఉదయం టిడిపి నాయకులు ఆర్‌టిసి డిపో ముందు ధర్నా నిర్వహించి కొద్దిసేపు బస్సులను నిలిపివేశారు. అనంతరం పోలీసులు నాయకులను అక్కడ నుంచి పంపించివేశారు. దీంతో బస్సులు యథావిధిగా నడిచాయి. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉండి : మండలంలో బంద్ పాక్షికంగా జరిగింది. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజును

ఉండిలో..

గృహనిర్బంధం చేశారు. పార్టీ రాష్ట్రకార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ బంద్‌కు జనసేన నాయకులు మద్దతు తెలిపారు. వాణిజ్య, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. ఆటోలు, ఆర్‌టిసి బస్సులు యథావిధిగా తిరిగాయి. ఈ కార్యక్రమంలో జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి నేతలు ముదునూరి కృష్ణంరాజు, కునుకు శ్రీనివాస్, గురుగుబిల్లి వెంకటసత్యనారాయణ, మంతెన సాయిలచ్చిరాజు, కందుల బలరాం పాల్గొన్నారు.

ఆకివీడు : అవినీతి, అక్రమ అరెస్టులు, అన్యాయ పాలన ఆగేవరకూ టిడిపి పోరాటం సాగుతుందని ఆ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు గొంట్ల గణపతి అన్నారు. ఆకివీడులో బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా టిడిపి, జనసేన ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్య, వ్యాపార సంస్థలు పూర్తిస్థాయిలో మూతపడ్డాయి. అల్లర్లు, గొడవలు జరగకుండా పోలీసులు ఎక్కడికక్కడ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మండల కార్యదర్శి నవకోట్ల రామారావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకట్రావు, గంధం ఉమా సత్యనారాయణ, మైనార్టీ విభాగం జిల్లా నాయకులు అజ్మల్, జనసేన నాయకులు అనిల్, విజయ్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : పట్టణంలో బంద్ ప్రశాంతంగా సాగింది. ఈ బంద్‌కు జనసేన మద్దతు తెలిపింది. వ్యాపార దుకాణాలు, పలు ప్రయివేటు విద్యాసంస్థలను స్వచ్ఛందంగా మూసివేసి బందుకు సహకరించారు. ఆర్‌టిసి బస్సులు మాత్రం యథావిధిగా తిరిగాయి.

టిడిపి, జనసేన నేతల అరెస్ట్

నరసాపురంలో టిడిపి నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

పట్టణంలో ఆందోళన చేస్తున్న పలువురు టిడిపి, జనసేన నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురుకు మించి ఉండకూడదని, ధర్నాలు చేయరాదని పోలీసులు హెచ్చరించారు. అయినప్పటికీ నేతలు ఆందోళన చేయడంతో అరెస్టుకు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, టిడిపి నేతలకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. టిడిపి నేత పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించారు. పోలీసుల హెచ్చరికలను భేఖాతారు చేసిన నేతలను అరెస్ట్ చేసి వాహనాల్లో ఎక్కించి స్టేషన్ కు తరలించారు. ఈ బందుకు మద్దతు తెలిపిన జనసేన నాయకులు మిషన్ హై స్కూల్ రోడ్డు లోని పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పార్టీ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో జనసైనికులు, వీరామహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ క్రమంలో పోలీసులు అక్కడకు చేరుకుని నాయకర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

తణుకు : పట్టణంలో బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచి టిడిపి శ్రేణులు రోడ్లపైకి వచ్చి షాపులను మూసివేయించారు. ఆర్‌టిసి బస్సులను అడ్డుకున్నారు. ప్రయివేటు విద్యాసంస్థలకు ముందుగానే సెలవు ప్రకటించారు. వ్యాపార సంస్థలు, బ్యాంకులు, పెట్రోల్ బంకులు, సినిమా థియేటర్లో మూసివేశారు. మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా చర్యలు తీసుకున్నారు. ఆదివారం రాత్రి నుంచి రాధాకృష్ణ నివాసం వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి బయటకు వెళ్లకుండా హౌస్ అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, బసవ రామకృష్ణ పాల్గొన్నారు.

బ్లడ్‌బ్యాంకును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

త్వరలో అందుబాటులోకి బ్లడ్ బ్యాంకు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జిల్లాలో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంకును వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు పి.ప్రశాంతి కోరారు. భీమవరం మండలం రాయలంలో ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ రక్త కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్లడ్‌బ్యాంక్ లైసెన్సు ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్‌క్రాస్ సహకారంతో రెడ్‌క్రాస్ నేషనల్ హెచ్‌క్యూ ద్వారా రూ.1.20 కోట్ల విలువైన అన్ని పరికరాలను సమకూర్చనున్నట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే పలువురు సభ్యత్వం, దాతల సహకారంతో మౌలిక వసతులు కల్పించామన్నారు. బ్లడ్ బ్యాంక్ కోసం సిద్ధం చేసిన సౌకర్యాలు, పరికరాల గురించి రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ ఎంఎస్‌విఎస్.భద్రిరాజును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. బ్లడ్ బ్యాంక్‌ను వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా జిల్లాప్రజలకు మేలు చేకూరుతుందని కలెక్టరు అన్నారు.

CHANGE OF NAME

I, ULAMPARTHI LAVANYA, W/o. Ulamparthi Jashva Daniel, Age 38 Years, Female, Hindu, D.No. 5-5, Chakirevugunta, Jinnuru - 534 265, Poduru Mandal, West Godavari District, A.P., India. Have Changed My Surname From **ULLAMPARTHI LAVANYA (Old Name) to ULAMPARTHI LAVANYA (New Name).** Hence After All My Documents (Passport Etc.,) and Correspondence will Continue with My New Name **ULAMPARTHI LAVANYA.**

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి.నెం. 79/2022
ఓ.యస్.నెం. 42/2017

బిట్వీన్:
కోటబోయిన కాసులు ...డి. హెచ్.ఆర్
మరియు
ఈపి మురళి కృష్ణ ...జె.డి.ఆర్

పై నెంబరు గ్రంథములో డి.హెచ్.ఆర్ గారు శ్రీ కోర్టు వారి ద్వారా మిమ్ములను కోర్టు వారి ఎదుట హాజరు కావాలని పలుమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినప్పటికీ మీరు కోర్టు నోటీసులు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకముగా కాలయాపన చేయు చున్నారు అనిన్నీ, కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.26-09-2023వ తేదీ నాటికి వాయిదా వేసినారు. మీరు ఆ రోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, మీ వకీలుగారి ద్వారా కానీ హాజరు అయ్యి మీ యొక్క అక్షేపణలు తెలుపుకొనవలయును.** లేనియెడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

గొల్లపూడి వెంకట ద్వారకానాథ్
న్యాయవాది,
తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం.
11-09-23. సెల్: 93464 84736

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి :: ఏలూరు

ఇ.పి.నెం. 268/2017
ఒ.యస్.నెం. 286/2015

బిట్వీన్:
చింత రాజారావు ...డిక్రీ హోల్డర్
మరియు
శ్రీమతి దామెర్ల రాధిక ...జడ్జిమెంటు డెటారు

డిక్రీ హోల్డర్ దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల ఇ.పి. వారంటు గ్రంథములో శ్రీ కోర్టు వారు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని **ది.03-10-2023వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు వేలం వేయుదురు.** ఆసక్తి ఉన్నవారు సదరు వేలంలో పాల్గొనవచ్చును. పూర్తి విరములకు డిక్రీ హోల్డర్ ప్లీడరు గారిని సంప్రదించగలరు.

షెడ్యూలు

పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, వట్లూరు సబ్ రిజిస్ట్రీ పెదపాడు మండలం, 10వ రోడ్డు, నెహ్రూ నగర్, దాఖలా 300 చదరపు గజముల స్థలం, దగ్గర డో.నెం. 9-11-20 కు హద్దులు:
తూర్పు: పోరంబోకు స్థలం 31 అ॥లు.
దక్షిణం: మాగంటి బాబు స్థలం 89 అ॥లు.
పడమర: రాజవీధి 31 అ॥లు.
ఉత్తరం: పి.యోగానందం అనే పెరుమాళ్ళ యేసునాధం గారి సరిహద్దు గోడ 86 అ॥లు.

పై హద్దుల మధ్య 300 చదరపు గజముల స్థలం ఉన్నది.

డిక్రీ హోల్డర్ విలువ : రూ.8,00,000/-
అమీనా విలువ : రూ.20,00,000/-

కె.జె.వివస్వంత
ఏలూరు, **పి.నాగమురళి**
11-9-23. అడ్వకేట్స్, ఏలూరు.

నిత్యావసర సరుకులు అందిస్తున్న జనసేన నాయకులు

పేదల సంక్షేమమే జనసేన లక్ష్యం

ప్రజాశక్తి - కాళ్ల

జనసేన పార్టీ ఆశయాలకు అనుగుణంగా పేద ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని ఆ పార్టీ సీసలి గ్రామ అధ్యక్షులు నూకల బోగేంద్రబాబు అన్నారు. సీసలి గ్రామానికి చెందిన జాన్సీరాణి ఆర్థిక సహకారంతో గుత్తుల సత్యవతి జ్ఞాపకార్థంగా పేదలకు నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. నూకల బోగేంద్రబాబు జనసైనికులు కలిసి ఏడో వారం గ్రామంలోని పది నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరి భరత్, జన సైనికులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి

ఘర్షణలు తలెత్తకుండా చర్యలు : ఎస్‌పి

ఆకివీడు : పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ అన్నారు. బంద్ నేపథ్యంలో ఆకివీడులో ఆయన పర్యటించారు. సందర్భంగా ఆయన అధికారులకు పలుసూచనలు చేశారు. జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్లు అమలులో ఉన్నందన నిరసనలకు, ధర్నాలకు, బంద్‌కు అనుమతి లేదని ఎస్‌పి తెలిపారు. బందు పేరుతో బస్సు ప్రయాణాలకు, పాఠశాలలు, కళాశాలలు, వ్యాపార సముదాయాలకు ఆటంకాలు కలిగిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సిఐ సత్యనారాయణ, ఎస్ఐ నాగబాబు ఉన్నారు.

శ్రీగౌతమి ప్రిన్సిపల్ శ్రీనివాస్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి- మొగల్తూరు

అవార్డుతో శ్రీనివాస్

నరసాపురం శ్రీగౌతమి కళాశాల ప్రిన్సిపల్ పత్రి శ్రీనివాస్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. గుంటూరులో ఆంధ్రప్రదేశ్ ప్రయివేటు టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దక్షిణ భారతదేశం స్థాయిలో ఉపాధ్యాయ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాలుగు రాష్ట్రాల నుండి సుమారు 450 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డును అందించారు. దీనిలో భాగంగా శ్రీనివాస్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. గుంటూరు కలెక్టర్, గుంటూరు-2 ఎంఎల్ఎ, డిఎస్‌పి ద్వారా ఈ అవార్డు అందుకున్నారని కళాశాల యాజమాన్యం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ అండ్ కరస్పాండెంట్ చినిమిల్లి దుర్గాప్రసాద్, మొగల్తూరులోని గౌతమి పాఠశాల ప్రిన్సిపల్ కైలా నరేష్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మట్టి గణేష్ విగ్రహాలనే వాడాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మట్టి వినాయక విగ్రహాలనే వాడాలంటూ ప్రచారభేరి కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో సోమవారం పిఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుధారాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, ముఖ్యంగా వినాయక చవితి పూజకు మట్టితో చేసిన విగ్రహాలనే వాడాలన్నారు. మట్టి విగ్రహాలను వాడి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. సైన్స్ ఉపాధ్యాయులు పి.చిట్టికుమారి మాట్లాడుతూ రసాయనాలతో కూడిన భారీ వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నారని, నిమజ్జనం సమయంలో కాలువలు, చెరువులు కాలుష్యంతో నిండిపోతున్నాయన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రధానమంత్రి జి20 సదస్సులో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారని, మట్టి వినాయక విగ్రహలనే వాడకం మంచిదని సూచించారన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి ప్ల కార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎం.మహాలక్ష్మి, కె.స్వర్ణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షీరా రామలింగేశ్వర ఆలయంలో శేషుబాబు దంపతులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని టిటిడి పాలకమండలి సభ్యులు మేకా శేషుబాబు దంపతులు సోమవారం సందర్శించారు. ఆయనకు ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ, ట్రస్టీలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాలు ఫోటో అందించారు. ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదానం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ జోగి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు

గ్లోబల్ ఇంజినీర్లుగా తయారుకావాలి

జెఎన్‌టియు కాకినాడ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మురళీకృష్ణను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఇంజినీరింగ్ విద్యార్థులు గ్లోబల్ ఇంజనీర్‌గా తయారు కావాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించగలరని జెఎన్‌టియు కాకినాడ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ కెవిఎస్‌జి.మురళీకృష్ణ ఇంజినీరింగ్ నూతన విద్యార్థులకు సూచించారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువు విజ్ఞానం పెంపొందించుకోవడమే లక్ష్యంగా సాగాలని చెప్పారు. అందుబాటులోకి వస్తున్న సెల్ ఫోన్, ఇతర మాధ్యమాలను విజ్ఞాన సముపార్జనకు మాత్రమే ఉపయోగించాలని, లేకుంటే విద్యార్థి జీవితం అంధకారమవుతుందన్నారు. ఓర్పు, సహనం, నేర్పు, స్నేహితులను, తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ సమాజంలో మంచి నడవడికను అలవర్చుకుని అందరిలో మంచివ్యక్తిగా నిలబడాలన్నారు. అహంకారం, ఎదుటివారిని హేయ భావంతో చూడటం మంచి పద్ధతి కాదని చెప్పారు. ప్రతివిద్యార్థి మతం, కులం, ప్రాంతీయతత్వం ఇలాంటి అవలక్షణాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. సాంకేతిక విప్లవంలో ప్రపంచమంతా ఒక గ్లోబల్ సిటీగా మారిందని, ఆ స్థాయిలోనే విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుంటే భవిష్యత్తు ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఎన్నో వసతులున్నాయని పేర్కొన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ వివిఎస్‌ఎన్.వర్మ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. వాటికి అలవాటుపడితే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, డాక్టర్ సురేష్ బాబు, వివిధ విభాగాల హెడ్స్ పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వ్యాధి నిరోధక టికాలు తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఐదేళ్లలోపు వారికి వ్యాధినిరోధక టీకాలు తప్పక వేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరు పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు 5.0 కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించడమే జాతీయ 'ఆరోగ్య మిషన్' ఇంద్రధనస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. గతనెల ఏడో తేదీ నుంచి 12 వరకూ మొదటి విడతలో భాగంగా రొటీన్ వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రెండో విడతగా ఈనెల 11 నుంచి 16 వరకూ, మూడో విడతగా వచ్చేనెల తొమ్మిదో తేదీ నుంచి 14 వరకూ టీకా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, డిసిహెచ్‌ఎస్ డా.సూర్యనారాయణ, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతారాణి, డిఐఒ డాక్టర్ దేవసుధ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం అభినందనీయం

ప్రజాశక్తి - ఉండి

వృద్ధులకు అన్నదానం చేయడం అభినందనీయమని ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంతెన యోగేంద్రబాబు అన్నారు. సోమవారం రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మహదేవపట్నంలో సన్‌రైజ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా యోగేంద్రబాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుట్టినరోజు వేడుకలను వృద్ధాశ్రమాల్లో నిర్వహించడం వల్ల వృద్ధులకు కడుపునిండా అన్నం పెట్టిన వారవుతారని ఆయన సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో వైసిపి సోషల్ మీడియా జిల్లా కో ఇన్‌ఛార్జి పాటూరి శ్రీనివాస దొరబాబు, నియోజకవర్గ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కొండేటి శివకుమార్, మైప గ్రామ సర్పంచి గొట్టుముక్కల తిరుపతిరాజు, వేండ్ర అగ్రహారం మాజీ సర్పంచి వీరవల్లి ముత్యాలరావు, పెద్దిశెట్టి సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

పుట్టిన రోజు వేడుకల్లో యోగేంద్రబాబు

పబ్లిక్ నోటీసు

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ యొక్క అనుబంధ సంస్థ)
రి.నెం. ABC-CS/006/2015

H.O. : ABCCS Endowments Commissionerate Complex, Gollapudi, Vijayawada-521 225. Phone: 0866-6650307
B.O. : ABCCS , D.No.23B-5-96/1, R.R.Peta, ELURU-534 002, Ph: 08812-249787

ఈ ప్రకటనలోని వారి తాలూకు ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్తిని సొసైటీ నందు తనఖా పెట్టి అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్థి తనఖా పై సొసైటీ వారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజుల లోపుగా లిఖితపూర్వకంగా అభ్యంతరములను రిజిస్టరు పోస్టు విత్ ఎకనాలెడ్జ్‌మెంటు ద్వారా సొసైటీకి తెలియపర్చవలసినదిగా కోరుతున్నాము.

Sl.No.	Applicant Name & Present Residence Address	Description of the Property
1	Sri. Devambhotla Rajasekhar, GL No. 42586, S/o. D.Subrahmanya Sharma, D.No. 9-90, Indira Nagar, Hanuman Junction, Krishna Dist, A.P-521105. Cell: 9866364002 /8187834002	The Property an extent of 321 Sq. Yds of house site along with RCC roofed residential building therein, in RS No. 195/1A, Old D.No.9-56, New D.No. 16-25, Present D.No. 9-90, Asst. No. 3025, Bapulapadu (V, GP & M), Krishna Dist., A.P. - 521105 Value Rs. 31.90 Lakhs.

Eluru,
11-09-2023.
Branch Manager
NORI LAKSHMI NARASIMHAM
Cell No. 92810 29465/ 63006 34609